క్లుప్తంగా

శిశు సంరక్షణ సంస్థల పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు



సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: జిల్లా కేంద్రంలో బాలల సంరక్షణ కేంద్రాలకు కలెక్టర్ రామ్‌సుందర్ రెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు శుక్రవారం అందజేశారు. ఓ చిల్డ్రన్ హోమ్, నాలుగు ఎన్‌జీవో హోమ్‌లు, మూడు బాలసదన్‌లకు సంబంధించి నిర్వాహకులను పిలిచి మరీ వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శిశు సంరక్షణ సంస్థలపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి మూడు నెలలకోసారి అన్ని శిశు సంరక్షణ కేంద్రాలను తనిఖీ చేసి ఫారం–46లో నివేదికలను తమకు కమిటీ అందజేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విమలారాణి, బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



104 వాహనంలో రికార్డులు పరిశీలిస్తున్న 104 జిల్లా మేనేజర్ నరసింహమూర్తి

భోగాపురం: 104 వాహనం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 104 జిల్లా మేనేజర్ నరసింహమూర్తి సిబ్బందికి సూచించారు. మండలంలోని పోలిపల్లి పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వద్ద ఉన్న 104 వాహనాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించి, ఏ రోజు ఎక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నారు..రోజుకు ఎంతమంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం వాహనంలోని మందులు, రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

విజయనగరం టౌన్: శ్రీమన్నార్ రాజగోపాల స్వామి దేవస్థానం నూతన ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారం ఆలయ ఆవరణలో శుక్రవారం జరిగింది. ఆలయ ఈవో వంశీలక్ష్మి ఆధ్వర్యంలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా మడిమి దేవేంద్రనాథ్, సభ్యులుగా తూటిక వెంకటరావు, కంటుభుక్త రాంబాబు, అలివేలి వెంకటరావు, కారుబిల్లి శంకరరావు, దాసరి సత్యవతి, ఇమంది అమ్మాజీ, మద్దాల జగదాంబలు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, దేవదాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలి



మాట్లాడుతున్న వైద్యులు సుధీర్‌నాయుడు, హేమస్వరూప్

విజయనగరం ఫోర్ట్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని(క్షతగాత్రులు) సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని తిరుమల మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సుధీర్‌నాయుడు, డాక్టర్ హేమస్వరూప్‌లు అన్నారు. ట్రామా డే పురస్కరించుకుని, స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రమాదవశాత్తు తలకు గాయమైతే వెంటనే చికిత్స చేయడం ద్వారా వారి ప్రాణం నిలబెట్టవచ్చన్నారు. ప్రతిఒక్కరూ సీపీఆర్, ప్రాథమిక చికిత్సలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో వైద్యులు ప్రవీణ్, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లి అంబలం పూజ



పూజలో పాల్గొన్న భక్తులు, దీక్షాపరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీపైడితల్లి అంబలం పూజ నగరంలోని కోట జంక్షన్ వద్ద ఉన్న అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీపైడిమాంబ దీక్షా ఆదిపీఠం ఆధ్వర్యంలో గురుస్వాములు ఆర్.సూర్యపాత్రో, ఎస్.అచ్చిరెడ్డి, రంజిత్, మహేష్ నేతృత్వంలో వందలాది మంది భక్తులు ఈ పూజల్లో పాల్గొని, అమ్మవారి పట్ల తమకున్న భక్తిశ్రద్ధలు చాటుకున్నారు.

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

- తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేసిన జర్నలిస్టులు



నెల్లిమర్ల: తహసీల్దారు శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

నెల్లిమర్ల: పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నెల్లిమర్ల విలేకరులు కోరారు. ఈ మేరకు తహసీల్దారు శ్రీకాంత్‌కు మండల కేంద్రంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పత్రికలు అనేవి ప్రజాపక్షమని, వృత్తి నిబద్ధతను పాటిస్తున్న 'సాక్షి'పై ప్రభుత్వం కక్షకట్టడం అప్రజాస్వామ్యమని ఖండించారు. వార్తలు సహేతుకంగా లేవని భావించినప్పుడు వివిధ వేదికల ద్వారా వాటిని ఖండించాలే తప్ప ఇలా పదేపదే వేధించడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా అక్రమ కేసుల ద్వారా వేధింపులకు దిగడం భావప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమేనన్నారు. రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన నకిలీ మద్యం మాఫియాపై సాక్షి దినపత్రిక ప్రచురించిన కథనాలకు ఎడిటర్ ధనుంజయరెడ్డిని కూటమి సర్కారు ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక కథనాలు ప్రచురించినందుకే పోలీసులతో నోటీసులు జారీ చేయిస్తూ ప్రభుత్వమే ఇలా చేస్తుండడం దుర్మార్గమైన చర్యన్నారు. రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, పత్రికాస్వేచ్ఛను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఏపీడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఆరిపాక రాము, నెల్లిమర్ల ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి పతివాడ రాజారావు, సాక్షి విలేకరులు పక్కి సురేష్, కలిశెట్టి బాబూరావు, ప్రజాశక్తి విలేకరి కొండల సీతారాం, జనం విలేకరి భాస్కరరావు తదితరులు ఉన్నారు.



పూసపాటిరేగ: తహసీల్దారును కలిసిన జర్నలిస్టులు

పత్రికలపై దాడులు దుర్మార్గం

పూసపాటిరేగ: నిజాలను నిర్భయంగా బయటపెట్టే వార్తా పత్రికలపై దాడులు దుర్మార్గమని పలువురు జర్నలిస్టులు ఖండించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏరులైపారుతున్న నకిలీ మద్యంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనాలపై ప్రభుత్వమే కక్షపూరితంగా కేసులు పెట్టించడం, పోలీసులను సాక్షి సంస్థలపై ఉసిగొల్పి ఇబ్బందులకు గురిచేయడాన్ని నిరసిస్తూ పూసపాటిరేగ తహసీల్దారు ఎన్వీ రమణమూర్తికి పలు జర్నలిస్టు యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రజల పక్షాన నిలిచే పత్రికలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేయడమనేది సిగ్గుచేటు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించిన వారిని మనమంతా వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు సీహెచ్ లక్ష్మీనాయుడు, కె.హరిబాబు, జి.రామారావు, బి.అప్పారావు, పి.గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా సంతకాల సేకరణ



సంతకాల పత్రాలు చూపిస్తున్న నాయకులు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ చేపట్టిన సంతకాల సేకరణ ఉద్యమంలా కొనసాగుతోంది. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం చాలా చురుగ్గా జరుగుతుండగా, శుక్రవారం పూతికపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు లెంక గోవింద ఆధ్వర్యంలో జరిగిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పేద విద్యార్థులను ప్రభుత్వ వైద్యవిద్యకు దూరం చేస్తూ చేసే కూటమి కుట్రలను ఖండిస్తూ పెద్దసంఖ్యలో గ్రామస్తులు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వమే నడపాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కొత్త నియామకాలు

విజయనగరం: వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విజయనగరం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీలో కొత్త నియామకాలు చేపట్టారు. నగర పార్టీ ఉపాధ్యక్షులుగా రెడ్డి గురుమూర్తి, అవనాపు లక్ష్మణరావులు, ప్రధాన కార్యదర్శులుగా అల్లు చాణక్య, కర్రి రాఘవరెడ్డి, బొట్టా యాదవ్‌కుమార్, జమ్మాన శ్రీనివాసరావు, అడారి నాగేశ్వరరావు, బోడసింగి ఈశ్వరరావులు నియామకం కాగా కార్యదర్శులుగా బూరాడ శ్రీనివాస్, బాలి అశోక్‌కుమార్, తాళ్లపూడి వెంకట రమణమూర్తి, దువ్వు శ్రీనివాసరావు, పాట్నూరు రాఘవేంద్రరావు, కాపుగంటి రమేష్, పైల భవానీ యాదవ్, గుండ వీరభద్రయ్య, గనరాజు కృష్ణంరాజు, మొకర సతీష్‌కుమార్ నియమితులయ్యారు. వీరితో పాటు మరో 50 మంది పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నియమితులయ్యారు.

అనుబంధ కమిటీలు..

వైఎస్సార్ సీపీ యువత విభాగం అధ్యక్షుడిగా చెల్లూరి భార్గవ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పిన్నింటి కళావతి, బీసీ విభాగం అధ్యక్షుడిగా భోగాపురపు రవిచంద్ర, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బొంగ భానుమూర్తి, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా దాసరి సుంకయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పొన్నాడ మణికంఠ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా దేవుపల్లి సుందరరావు, బూత్ కమిటీ అధ్యక్షుడిగా బండారు ఆనంద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా జమ్ము మధుసూదనరావు, లీగల్ సెల్ అధ్యక్షుడిగా గువ్వల తిరుపతిరావు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా రౌతు భాస్కర రెడ్డి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా కంటుభుక్త బాలాజీ, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కనకల కృష్ణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా బొబ్బాది త్రినాద్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా సుంకరి నారాయణమూర్తి, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా కడియాల రామకృష్ణ, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా సత్తి అచ్చిరెడ్డి, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా బ్రహ్మదేవ రామకృష్ణ, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా సప్పా ప్రసాద్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఎస్‌కే రెహమాన్, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా నెల్లూరి సంగీత్‌కుమార్, ఎంప్లాయీస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా చలుమూరి లక్ష్మణప్రసాద్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన జారీ అయింది.

హోరాహోరీగా...




కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడాప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో అండర్–14, 17 బాలుర విభాగంలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, యోగా పోటీలకు విజయనగరం మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న 1200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల కోఆర్డినేటర్ కె.తౌడుబాబు ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా, ఎంఈఓ సత్యవతి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు కె.గోపాల్, విజయలక్ష్మి పోటీలను ప్రారంభించారు. శనివారం బాలికల విభాగంలో పోటీలు నిర్వహిస్తామని తౌడుబాబు తెలిపారు. 21న అథ్లెటిక్స్ క్రీడాంశంలో బాల, బాలికలకు మండల స్థాయి పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపిక పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పర్యవేక్షించారు.

క్రీడలతో మానసికోల్లాసం

మండల స్థాయి స్కూల్ గేమ్స్ శుక్రవారం ఆరంభమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. క్రీడాకారులను ఉత్తేజపరుస్తూ అధికారులు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఒక్క చదువులోనే కాదు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడల్లో సత్తా చాటిన ఎంతోమంది ఉన్నత స్థానాలకు చేరారని తెలిపారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహపడకుండా గెలిచిన వారిని అభినందించి క్రీడాస్ఫూర్తి కనబరచాలని సూచించారు. క్రీడలతో శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందన్నారు. ఇక్కడి పోటీల్లో గెలుపొందిన వారు డివిజన్ స్థాయి స్కూల్ గేమ్స్‌కు అర్హత సాధిస్తారని, బాగా ఆడి పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

–భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ



భోగాపురం: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రమణమూర్తి



పూసపాటిరేగ: వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



డెంకాడ: పెదతాడివాడ స్కూల్ మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



పూసపాటిరేగ: క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నేడు స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర

విజయనగరం: స్థానిక ఎస్‌బీఐ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ప్రతి మూడో శనివారం ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమం ఆ తర్వాత ర్యాలీ ఉంటుందని, విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం వంటివి చేయడం జరుగుతుందన్నారు.

చిట్టిబాబుకు సన్మానం



చిట్టిబాబును సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం: స్థానిక గురజాడ స్వగృహంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబుకు శుక్రవారం సన్మానం చేశారు. బాలలు, మహిళలు, దళితుల హక్కుల కోసం నిత్యం పోరాడే చిట్టిబాబు..కతర్ దేశ రాజధాని దోహాలో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో నవంబరు మొదటి వారంలో జరిగే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే గొప్ప అవకాశం లభించడం గర్వకారణమని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు గురుప్రసాద్, జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. ఈ మేరకు చిట్టిబాబు సేవలను అభినందిస్తూ సన్మానం చేయడం మన అదృష్టమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ఎం.సుభద్రాదేవి, మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఆచార్యులు జనార్దన్‌నాయుడు, రచయిత రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి వరం

విజయనగరం: వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి గొప్ప వరమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో పీఎం స్వనిధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ పీఎం స్వనిధి రుణాలు హెచ్చు స్థాయిలో మంజూరయ్యేలా కృషి చేయాలని కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్‌లకు సూచించారు. పీఎం స్వనిధి 2.0లో రుణాలు పెంచడం జరిగిందని, బ్యాంకులు, లబ్ధిదారులకు అనుసంధానకర్తలుగా వ్యవహరించి పథకం శతశాతం విజయవంతమయ్యేలా చూడాలన్నారు. రుణాలు సక్రమంగా చెల్లించే వారికే తిరిగి రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మెప్మా పీడీ చిట్టిరాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, టీపీఆర్వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీవో లావణ్య

భోగాపురం: బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీవో లావణ్య కోరారు. మండల కేంద్రంలోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో బాల్యవివాహాల నిర్మూలన, లింగ వివక్ష, బాలికల అక్రమ రవాణా, లైంగికదాడుల నివారణ వంటి అంశాలపై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. ఎవరు ఎప్పుడు ఎవరితోనైనా శారీరకంగా గానీ మానసికంగా గానీ వేదనకు గురైతే పోలీసులు, వన్‌స్టాప్ సెంటర్‌లను ఆశ్రయించి న్యాయరక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సత్యవాణి, రాజేశ్వరి, ఎస్‌జీవో శివశంకర్, కార్యకర్తలు రమణమ్మ, యశోద, తులసి, వర, అనూరాధ, ఉపాధ్యాయులు రమణమ్మ, అరుణ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా



తమ న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ ఆటో కార్మికులు విజయనగరం కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మలు పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంతో ఆటో కార్మికులంతా తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవో నంబర్ 21, అచ్యుతాపురం ప్రైవేట్ ఫిట్‌నెస్ సెంటర్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వాహనమిత్ర పథకం ద్వారా లైసెన్స్ కలిగిన ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.25 వేలు చొప్పున ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

–విజయనగరం గంటస్తంభం

పెంచిన పని గంటలు రద్దు చేయాలి



ప్రాణాలు త్యజించి కార్మిక వర్గం సాధించుకున్న 8 గంటల పని విధానానికి భిన్నంగా 10 గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడాన్ని ఏపీ బేవరేజెస్ కార్మికులు వ్యతిరేకించారు. పని గంటల పెంపు చేపడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోకు వ్యతిరేకంగా నెల్లిమర్ల మండల కేంద్రంలోని ఏపీ బేవరేజెస్ డిపో వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఇప్పటికే తమకు ఇస్తున్న చాలీచాలని జీతాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జీతాలు పెంచకపోగా పని గంటలు పెంచడం దుర్మార్గమని ఖండించారు. తక్షణమే కొత్తగా తీసుకువచ్చిన జీవోను రద్దు చేయాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శంకరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

–నెల్లిమర్ల

గ్రాట్యుటీ బకాయిలు చెల్లించాలి



నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు రిటైర్డ్ కార్మికులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ బకాయిలు తక్షణమే చెల్లించాలని జ్యూట్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ మిల్లు గేటు వద్ద కార్మికులతో శుక్రవారం సమావేశమైన ఆయన.. ముడిసరుకు(నార) కొరత పేరిట కార్మికులను యాజమాన్యం కుదించడం సరికాదన్నారు. మిల్లును నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఎంతో మంది కార్మికులు యాజమాన్యం అనాలోచిత నిర్ణయాల వల్ల రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులను న్యాయం చేయాలని కోరారు.

–నెల్లిమర్ల

రొమ్ము కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



పింక్ పవర్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరంఫోర్ట్: రొమ్ము కేన్సర్‌పై మహిళలంతా అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద పింక్ పవర్ వాక్ 2.0ను ఎస్పీ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. మహేంద్ర ఆస్పత్రి, మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ..రొమ్ము కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే దానిని నివారించడం సాధ్యమని చెప్పారు. ప్రతి మహిళ రొమ్ము కేన్సర్‌పై అవగాహన పెంచుకుని, రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం కేన్సర్ రావడానికి గల కారణాలు, దాని బారినపడకుండా చేపట్టాల్సిన చర్యలను వైద్యులు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేంద్ర గిరి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జయశంకర్, డాక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: నగరంలో బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో శుక్రవారం సమావేశమై నిబంధనలు అతిక్రమించిన వారిపై తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గతంలో మాదిరి తోపుడుబండ్లు, చిన్నచిన్న బడ్డీకొట్లుపై బాణసంచా విక్రయాలకు అనుమతి లేదని, జనావాసాలకు దూరంగా బాణసంచా విక్రయాల దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని ఆ దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: దీపావళి మందుగుండు సామగ్రి విక్రయాలకు సంబంధించి అనుమతులు తీసుకోవడంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె.దుర్గాప్రసాద్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బాణసంచా విక్రయించాలనుకునే వారు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా తనిఖీలకు వచ్చినప్పుడు అనుమతి పత్రం చూపించాలని, లేనియెడల చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.